## తిట్లూ , దీవెనలు ....

"అమ్మా తమ్ముడు నా గోళీకాయలు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వమంటే ఇవ్వనంటున్నాడు."

వంటింట్లో గంజివారుస్తున్న తల్లి దగ్గరకు వెళ్ళి గోలపెట్టేడు పెద్దాడు. పేరుకు పెద్దాడు కానీ వాడి వయసు పదేళ్ళే.

"చిన్నా" అంటూ కేకపెట్టింది తల్లి. పెరట్లో గోళీలు ఆడుతున్న చిన్న ఈ పిలుపు వినబడనట్లే వుండిపోయాడు కొంతసేపు. తరువాత మరోసారి పిలుపు వినిపించేసరికి ఇక తప్పదని గునుస్తూ తల్లి దగ్గరకు వచ్చేడు.

"ఏరా చిన్నా! అన్నయ్య గోళీలు నువ్వెందుకు తీసుకున్నావ్?"

చిన్నాడివంక కోపంగా చూసింది తల్లి తులశమ్మ.

ఆ చూపులకు వాడు బెదరలేదు. కనీసం చలించలేదు.

"వాడు నాకిచ్చేడా? ఏరా నువ్వు నాకిచ్చేవా?" అంటూ అన్నవైపు కొరకొరా చూసేడు. అన్న సమాధానం చెప్పకపోయేసరికి తల్లివంక తిరిగి "నాకవి పెరట్లో దొరికేయి" అన్నాడు.

"మధ్యాహ్నం ఆడుకుంటూ వాటిని పెరట్లో వదిలేశాను... వీడు వాటిని కాజేశాడు. ఇప్పుడేమో అవి తనకు దొరికేయంటున్నాడు" పెద్దాడు చిన్న మాటలకు అడ్డుపడ్డాడు.

"నేను వాటిని కాజెయ్యలేదు. అవి నాకు దొరికేయి. కాబట్టినావే" చిన్న తలబిరుసుగా అన్నాడు.

"ఏవీ ఆ గోళీలు చూడనియ్" అంది తులశమ్మ.

నాలుగురోజుల క్రితం పిల్లలిద్దరూ గోళీలకోసం మారాంచేస్తే, ఇరవై గోళీలు కొని ఇద్దరికి చెరో పదీ ఇచ్చింది. అందులో పసుపు గోళీలు పెద్దాడికి, ఎరుపు గోళీలు చిన్నాడికీ, తనే పంచి ఇచ్చింది.

ఈ గోళీలు పచ్చవి. పెద్దాడివే! సందేహంలేదు!

"చిన్నా నీ ఆగడం మరీ మితిమీరిపోతోంది, ఈ పచ్చగోళీలు అన్నవని నీకు తెలీదూ? నువ్వెందుకు తీశావ్ వాటిని?" అంటూ మందలించబోయింది.

"అన్నవని వాటిమీద పేరు రాసి వున్నాయా? నాకు పెరట్లో దొరికేయి అవి"

"నోర్ముయ్ వెధవా, పెరట్లో గోళీలు పండుతాయనుకున్నావా? మీ తగవులు తీర్చలేక చచ్చిపోతున్నాను. మీకింత అన్నం వుడకేసి ప్రెసిడెంటుగారింట్లో వంటకు వెళ్ళాలి. వచ్చేటపుడు బూరెలు తెస్తాను. అంతవరకు గొడవచెయ్యకుండా ఆడుకోండి, ఇవిగోరా...

వీటిని నువ్వు తీసుకో" అంటూ పసుపుగోళీలు పెద్దాడికి అందించింది.

పెద్దాడు వాటిని తీసుకుని ఆనందంగా వెళ్ళిపోయాడు. చిన్నాడు అన్నవంకా, తల్లివంకా గుర్రుగా చూసేడు. తరువాత చడ్డీపైకి లాక్కుంటూ తనలో తాను గొణుక్కుంటూ ఎర్రగోళీలు పట్టుకొని రోడ్డుమీదకు పరుగెత్తేడు.

వెళ్ళిపోతున్న పిల్లలిద్దరివంకా కొంతసేపు చూసి ఉస్సురంటూ నిట్టూర్చింది తులశమ్మ. పెద్దాడికేమో బొత్తిగా నోట్లో నాలుకలేదు. మంచితనం తప్ప దురుసుతనం తెలీదు. చిన్నాడేమో మహాదురుసు, గట్టిపిండం! గడుగ్గాయి!

వాడి ఆగడాలు రోజు రోజుకూ విపరీతమయిపోతున్నాయి. 'పెద్దయితే వీళ్ళిద్దరి బతుకులూ ఎలా కడతేరతాయో ఏమిటో' అనుకుంది తులశమ్మ.

★ ★ ★

"అమ్మా"

పుస్తకాలసంచీ మోసుకుంటూ పరుగు పరుగున వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చేడు పెద్దాడు.

"ఏం బాబూ అప్పుడే స్కూలు వదిలేశారా"

"ఈవేళ లాస్టు పీరియడ్ టీచరు రాలేదమ్మా... అమ్మా మరేమో ... ఈ వేళ మా ప్రోగ్రెస్‌కార్డు ఇచ్చేరు. నాకు క్లాసంతటికీ ఫస్టొచ్చింది" అంటూ మెరిసిపోతున్న కళ్ళతో పుస్తకాలసంచీ మధ్య నుండి భద్రంగా దాచిన ప్రోగ్రెస్ కార్డుతీసి తల్లికి అందించేడు.

తులశమ్మ ఆనందానికి అవధుల్లేవు! చీర చెంగుతో చేతులు ఒత్తుకుంటూ ప్రోగ్రెస్ కార్డు అందుకుంది. అన్నిటిలోనూ ఎనభైలు దాటేయి. కార్డు తిరిగి వాడి చేతికిచ్చి వాణ్ణి దగ్గరకు తీసుకుని ముద్దాడింది. అంతలోనే తులశమ్మకు చనిపోయిన భర్త గుర్తుకు వచ్చేడు.

ఆమె కంట్లో నీళ్ళు తిరిగేయి.

"పెద్దాడా నువ్వు ఇంతబాగా చదువుతున్నందుకు మీ నాన్నగారు బతికే వుంటే ఎంత సంతోషించేవారో! అయినా నాకా అదృష్టం లేదురా" అంటూ కళ్ళుఒత్తుకుంది. తల్లి కంట్లో నీళ్లు చూసి పెద్దాడికి ఏడుపొచ్చింది.

తన చిన్న చేతుల్తో ఆమె బుగ్గల మీద నుండి కారిపోతున్న కన్నీళ్ళను తుడిచేడు.

"నువ్వలా ఏడవకే అమ్మా" అంటూ వుంటే వాడి కంఠం బొంగురు పోయింది.

"పెద్దాడా... నువ్వు, తమ్ముడూ చక్కగా చదువుకుని పెద్ద ఆఫీసర్లయితే ఏ లోకాన్నో వున్న మీనాన్నగారి ఆత్మ సంతోషిస్తుంది" అంది.

పెద్దాడు తల్లి ముఖం వంక తదేకంగా చూశాడు.

ఆమె మాటలు కొన్ని అర్థమయ్యేయి వాడికి మరి కొన్ని అర్థంకాలేదు.

అయితే తల్లి తమని పోషించి చదువులు చెప్పించటంకోసం అందరి ఇళ్ళల్లోనూ వంటలువండి, వడ్డనలుచేసి, ఎంత కష్టపడుతోందో మాత్రం ఇప్పుడిప్పుడే వాడి లేతమనసుకు అర్థమవుతోంది. కొద్ది నిమిషాల తర్వాత మెల్లగా అన్నాడు "అమ్మా తమ్ముణ్ణి వాళ్ళ మేష్టారు చితక్కొట్టేరు"

"ఎందుకు?" గాబరాగా అడిగింది తులశమ్మ

"పక్కకుర్రాడి పుస్తకం దొంగిలించి ఇంకో కుర్రాడికి రూపాయికి అమ్మేశాడట. ఆ రూపాయి పెట్టి జీళ్ళు మామిడికాయముక్కలూ కొనేసుకున్నాట్ట మేష్టారికి అసలు సంగతి తెలిసిపోయి చితక్కొట్టేరు".

తులశమ్మ గుండెలోతుల్లో కలుక్కుమంది.

చిన్నాడు రోజురోజుకీ ఇలా తయారవుతున్నాడేమిటి? చదువు సంధ్యలు ఎలాగూ లేవు! దొంగతనం కూడా నేర్చుకుంటున్నాడా?

"ఇంటికి రానీయ్ వాడి సంగతి చెబుతాను. నువ్వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కునిరా, అన్నం తిందువుగాని" అంది. పెద్దాడు అన్నం తింటూవుంటే చిన్నాడు వచ్చేడు. వాడి బట్టలన్నీ దుమ్ముకొట్టుకుపోయివున్నాయి. జుట్టంతా రేగిపోయి అసహ్యంగా తయారయి ఉంది. మోచేతులు మోకాళ్ళ నిండా మట్టి పేరుకుపోయి ఉంది. కాళ్ళమీద రక్తం మరకలు.

చిన్నాడిని చూస్తూనే విస్తుపోయింది తులశమ్మ. "ఆ రక్తం ఏమిట్రా? ఎక్కడయినా పడిపోయావా? ఆ అవతారం ఏమిటి? అయ్యయ్యో ఆ పుస్తకాలన్నీ అలా చిరిగి పోయాయేమిటి? స్కూలు సంచీ ఏది?" అంటూ గొల్లుమంది. చిన్నాడు ఏమీ మాట్లాడలేదు.

"అడుగుతూవుంటే అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడి పోతావేం? ఆ రక్తం ఏమిటి?" విరుచుకుపడింది తులశమ్మ.

"రవిగాడు తోసేశాడు"

"రవి తోసేశాడా? ఎందుకు తోసేశాడు? నువ్వేమీ అనకుండా వాడు తోసేస్తాడా?"

"ఆ రవి పుస్తకమేనమ్మా వీడు దొంగిలించింది. అందుకే మేష్టారు వీణ్ణి కొట్టారు" అన్నం తింటూ మధ్యలో చెప్పాడు పెద్దాడు. పెద్దాడి వంక గుర్రుగా చూశాడు చిన్నాడు.

"నా పెన్ను వాడెందుకు తియ్యాలి... అందుకే వాడి పుస్తకం అమ్మేశాను" అన్నాడు మొండిగా.

"బాగుందిరా... స్కూలుకు వెళ్ళి చదువు నేర్చుకుంటావని పంపిస్తుంటే, దొంగతనాలు అలవాటు చేసుకుంటున్నావన్నమాట. నీ పుస్తకాలసంచీ ఏమయింది?"

మొత్తుకుంటూ అడిగింది తులశమ్మ.

"రవీ, వాళ్ళన్నయ్యా కలిసి నా సంచి లాక్కున్నారు. రేపు వాళ్ళ పని పడతాను... ఇంకా నా సంగతి వాళ్ళకి తెలీదు" అంటూ ఉక్రోషంతో సవాలు చేశాడు చిన్నాడు.

'వేలెడంత లేదు వీడు ఎన్ని మాటలు నేర్చాడో?' అనుకుంటూ విస్తుపోయింది తులశమ్మ.

"చాల్లే నోర్ముయ్! వాళ్ళతో తగువెందుకురా మనకి? అయినా నీ పెన్ను తీస్తే టీచర్‌తో చెప్పాలికానీ వాడి పుస్తకం దొంగిలించి అమ్మేస్తావా?"

"వాడి మాటలు నమ్మకమ్మా. రవి మంచివాడే. వీడి పెన్ను వాడు తీయలేదు. అదిగో జేబులోనే ఉందిచూడు. చిన్నాడు అబద్ధం చెప్తున్నాడు" పెద్దాడు మధ్యన అందుకున్నాడు.

"నేనేం అబద్ధాలు చెప్పటంలేదు" అంటూ పెద్దాడివంక క్రోధంగా చూసి విసురుగా పెరట్లోకి పారిపోయేడు చిన్నాడు.

"కాళ్ళు కడుక్కుని ఆ దెబ్బమీద ఇంత పౌడరు అద్దుకో. అన్నం తిందువుగాని తొందరగారా" అంటూ పొయ్యి దగ్గరికి కదిలిపోయింది.

పెద్దాడికి చిన్నాడికి వయసులో తేడా ఒక సంవత్సరం మాత్రమే. అయితే చదువులో మాత్రం చిన్నాడు పెద్దాడికంటే రెండు తరగతులు వెనకబడిపోయాడు. పెద్దాడు ఏడవ తరగతిలోకి వచ్చాడు ఈ సంవత్సరం..

చిన్నాడు అయిదు ఫెయిలవడంతో మళ్ళీ చదువుతున్నాడు. రోజు రోజుకూ వాడిచదువు చెడిపోతోంది సరికదా చెడ్డబుద్ధులు కూడా అలవాటు చేసుకుంటున్నాడు.

'వీడెలా బాగుపడతాడో?' అదే ఆమె బెంగ. అంతలోనే కెవ్వుమన్న కేక. "అమ్మా" అన్న అరుపు వినిపించడంతో, గాభరాగా పొయ్యి దగ్గరనుండి పరుగెత్తుకొచ్చింది తులశమ్మ. చేతిలోని రుబ్బురోలు బండ గాభరాగా కింద పడేసి, పరుగెత్తుకుంటూ వీధిలోకి పారిపోయాడు చిన్నాడు.

పెద్దాడి నుదుటినుండి రక్తం కారుతోంది!

"నీ మొహం మండా, చచ్చినోడా... ఎంతపని చేశావురా;" అంటూ చిన్నాడిని నోటికొచ్చినట్లు తిడుతూ, శాపనార్థాలు పెడుతూ, గాభరాగా పాతగుడ్డ తెచ్చి పెద్దాడి నుదుటికి కట్టు కట్టింది తల్లి. రోకలిబండతో కొట్టిన దెబ్బకు నుదుటిమీద చిట్లినట్లు గాయం ఏర్పడింది.

"అలా వెళ్ళి మంచంమీద పడుకో నాయనా... ఇంటికి రానీయ్... ఆ వెధవ సంగతి చెపుతాను" అంటూ అక్కడలేని చిన్నాడిమీద రంకెలు వేస్తూ చిందులు తొక్కింది

తులశమ్మ.

"నేను నీతో నిజం చెప్పానుకదా.. అందుకని కొట్టాడు" అంటూ పెద్దాడు ఏడుపు లంకించుకున్నాడు.

"ఊరుకో నాయనా మా బంగారుబాబువునువ్వు..." అంటూ పెద్దాణ్ణి సముదాయించి మంచంమీద కూర్చోపెట్టి, చిన్నాడిని వెతుకుతూ రోడ్డుమీదకు వెళ్ళింది. కనుచూపు మేరలో చిన్నాడు ఎక్కడా కనుపించలేదు.

"ఇంటికిరా! నీ పని చెప్తాను" అంటూ తనలో తాను గొణుక్కుంటూ వీధి తలుపు చేరవేసి లోనికి వచ్చింది. పెద్దాడు నులకమంచంమీద పడుకొని ఏడ్చిఏడ్చి పావుగంటలో నిద్రలోకి జారిపోయాడు.

చీకటిపడినా చిన్నాడు ఇల్లు చేరుకోకబోయే సరికి తులశమ్మకు గాభరా పట్టుకుంది. వాడు ఏ అఘాయిత్యమయినా తలపెట్టేదేమోనని భయం వేసింది. ఇంట్లోకి, రోడ్డు మీదకు కొంతసేపు కాలుగాలిన పిల్లిలా ఇటూ అటూ తిరిగింది.

రాత్రి ఎనిమిది గంటలకు చిన్నాడు ఇంట్లోకి వచ్చాడు. దొంగలా గదిలోకి తొంగిచూసాడు.

పెద్దాడి నుదుటికి కట్టువుంది. మంచంమీద నిద్రలో వున్నాడు. మెల్లగా అడుగులు వేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు చిన్నాడు. తల్లి ఒక మూలగా కూర్చుని గిన్నెలు తోముతోంది. అడుగుల చప్పుడు విని వెనుతిరిగి చూసింది.

"ఏరా చిన్నా ఎక్కడికిరా పోయావు ఇంతసేపూ?అన్నయ్యను అలా కొట్టావు కదాఎంత దెబ్బ తగిలిందోచూడు... నువ్వేం ఇలా తయారవుతున్నావు?" అంది.

చిన్నాడు సమాధానం చెప్పకుండా కాలివేళ్ళతో నేలమీద రాస్తూ నిలబడ్డాడు.

వాడు ఎటూ పారిపోకుండా ఇల్లు చేరినందుకు ఆమె మనసు కాస్త తేలికపడింది.

"ఇంకెప్పుడూ అలా చెయ్యకు అన్నం పెడతాను రా, ఎప్పుడో మధ్యాహ్నం అనగా తిన్నతిండి" అంది.

చిన్నాడు మాట్లాడకుండా కంచం ముందు కూర్చున్నాడు. అన్నం వడ్డించి కాస్త కందిపచ్చడి మధ్యాహ్నం చేసినది మిగిలివుంటే, వాడి కంచంలో విదిపింది.

"పప్పులేదా?" అన్నాడు వాడు కంచం వంక అసహనంగా చూస్తూ.

"రేపు చేస్తానులే, ఈ వేళ్టికి తినెయ్" అంది బతిమాలుతున్న ధోరణిలో.

"అయితే నాకు అన్నం వద్దు" అన్నాడు.

"మంచివాడివి కదూ, బువ్వ తినేశావంటే పావలా ఇస్తాను" అంది బుజ్జగిస్తూ

"అర్ధరూపాయి ఇవ్వాలి" అన్నాడు చిన్నాడు బింకంగా.

"అలాగే తినేయ్ మరి" వాడు అన్నం తినటమే చాలన్నట్లు ఒప్పుకుంది. చిన్నాడు అన్నం తినటం ఆరంభించేడు. 'వీడితో వేగటమే కష్టంగా వుంది వీడి భవిష్యత్తు ఎలా వుంటుందో ఏమిటో' అనుకుంటూ గొణుక్కుంది తులశమ్మ.

★ ★ ★

"రండి పంతులుగారూ" అంటూ పంతులుగారికి నమస్కరించి బల్ల చూపించింది తులశమ్మ. "కాస్త దాహం పుచ్చుకుంటారా?"

"ఇప్పుడేమీ వద్దమ్మా మీ చిన్నోడి చదువు గురించి చెప్పిపోదామని వచ్చాను" అంటూ ఉస్సురంటూ బల్లమీద కూర్చున్నారు పంతులుగారు.

పంతులుగారు చిన్నాడి చదువు గురించి చెప్పబోయే వివరాలు తులశమ్మకు తెలుసు. వాడు టెన్త్‌క్లాస్ పరీక్ష తప్పితే. మూణ్ణెల్లక్రితం పంతులుగారి దగ్గర ప్రయివేటుకు కుదిర్చింది. అష్టకష్టాలుపడినెలకు మరో ఇరవై రూపాయలు సంపాదించి పంతులుగారి ఒళ్ళోపోస్తోంది.

పెద్దాడికి ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలూ స్కాలర్‌షిప్ లభించడంవల్ల పైసాఖర్చులేకుండా వాడి చదువు సాగిపోయింది. ఫస్టుక్లాసులో పాసయ్యాడువాడు. కానీ సమస్య అంతా చిన్నాడితోనే.

"తులశమ్మా! నీ కష్టంచూసి నా కడుపు తరుక్కుపోతోంది. చావులకీ, పెళ్ళిళ్లకి వంటలువండి నీళ్ళుమోసి, సంపాదించిన డబ్బులో ఇరవై రూపాయలు ప్రతినెలా నా ఎదాన పోస్తున్నావు.మీ చిన్నాడేమో నెలకి నాలుగు రోజులయినా పట్టుమని ప్రైవేటుకి రావడంలేదు. అడిగితే సమాధానం చెప్పడు. కొడితే ఒళ్ళప్పగించేస్తాడు. వాడికి చెడు సావాసాలు, బీడీలు కాల్చటం అలవాటయ్యాయి. వాణ్ణి మార్చటం నాతరంకాదు. నీ కష్టార్జితం నాకు అన్యాయార్జితం! ఈనెలనుండీ నువ్వునాకు జీతం ఇవ్వకు. వాడికి చదువు అబ్బదు. ఈ మాట నీ చెవినివేసి పోదామని వచ్చేను" అని పంతులుగారు చెప్తూంటే మారు మాటాడలేక గోడకు చేరగిలబడివుండి పోయింది తులశమ్మ. అంతలోనే "నమస్కారం పంతులుగారూ" అంటూ వచ్చాడు పెద్దాడు.

"శుభం భూయాత్! రా బాబూ!" అంటూ ఆప్యాయంగా పెద్దాడివంక చూసేరు.

"అమ్మా నాకు మెడిసిన్‌లో సీటు వచ్చిందమ్మా! ఎంట్రన్సులో మొదటినుండి పదిహేనో ర్యాంకు వచ్చింది" అంటూ తల్లిపాదాలకు వంగి నమస్కరించేడు పెద్దాడు.

"నా బాబే... డాక్టరు వవుతావన్నమాట ఎంత చల్లని కబురు చెప్పేవురా! ఉండండి పంతులుగారూ! మీ ఇద్దరికీ టీ ఇస్తాను." అంటూ పెద్దాడి తలనిమిరి వంటింట్లోకి వెళ్ళింది తులశమ్మ.

“నువ్వు ఇలా రేంకులు సంపాదిస్తున్నావు. మీ తమ్ముడు చూస్తే అలా పోకిరీ తిరుగుళ్ళు తిరుగుతున్నాడు” అంటూ గొంతు తగ్గించి “బాబూ... మీ అమ్మగారికి తెలిస్తే బాధపడతారని చెప్పలేదు. మీ చిన్నాడు మునసబుకూతుర్ని అల్లరి పెట్టాడట. ఈ ఉదయం మునసబు మనుషులు మీవాణ్ణి చితక్కొట్టేరు. వేళకి నేను వెళ్ళి విడిపించబట్టి సరిపోయింది. నువ్వుకాస్త దారిలో పెట్టాలి వాడిని” అన్నారు.

పెద్దాడు దీర్ఘంగా నిట్టూర్చాడు. ఈ సంగతి తన చెవినకూడా పడింది. కానీ తాను ఏమీ చెయ్యలేదు. తమ్ముడు పచ్చి మూర్ఖంగా తయారయ్యేడు. పదిహేడేళ్ళ వెధవకి రౌడీలతో, గూండాలతో స్నేహం. ఎప్పుడో రాత్రి పన్నెండు గంటలకు ఇంటికి రావడం! అంతలోనే తల్లి టీ తీసుకురావడం గమనించి “నేను కనుక్కుంటాను మేస్టారూ” అన్నాడు మెల్లగా. పంతులుగారు టీ తాగి వెళ్ళిపోయారు.

“పెద్దాడా! ఈవేళనాకు చాలా ఆనందంగా వుందిరా. నువ్వు తెల్లబట్టలు తొడుక్కుంటే దొరబాబులా వుంటావు. దిష్టితగుల్తుందిరా! ఒక్క నిమిషం” అంటూ వంటింట్లోంచి ఉప్పు, చింతపండు తెచ్చి దిష్టితీసి అవతల పారేసింది.

“ఏమిటమ్మా ఈ చాదస్తం అంతా” అన్నాడు నవ్వుతూ.

“బాబూ నువ్వు కష్టపడి చదివి డాక్టరువు కావాలి. నిజాయితీగా బ్రతకాలి. నీవల్ల పదిమంది ఉపకారం పొందాలి. అంతేకాని నీ వల్ల ఎవరూ బాధపడకూడదు. లోకానికి సేవ చెయ్ బాబూ” అంటూ దీవించింది తులశమ్మ నిండు మనసుతో.

అంతలోనే వీధిలో కలకలం!

ఒక్క ఉదుటున ఎవరో తోసినట్టు చిన్నాడు వచ్చి ముందు వరండాలో నేలమీద పడ్డాడు! అతని ఒళ్ళంతా దుమ్ముకొట్టుకుపోయివుంది.

“ఏమయిందిరా చిన్నా” అంటూ అతడి వాలకంచూసి, గోలపెట్టింది తులశమ్మ.

“ఏమయిందో మమ్మల్నడుగు మేం చెప్తాం” అంటూ వెనక నిలబడ్డ మునసబు మనుషుల్ని చూసి బెదిరిపోయింది ఆమె. చిన్నాడు మళ్ళీ ఏదో తంటా తెచ్చిపెట్టేడని అర్థమయింది. “ఏం జరిగింది?” అంటూ పెద్దాడు ఎదరకు వెళ్ళాడు.

“పెద్దాడా, నువ్వు ఇక్కడే వున్నావా? సరే ఇనుకో.... మీ చిన్నోడు మునసబు కూతుర్ని అల్లరి పెట్టేడంట! మునసబుతో పరాచికాలు పులితో పరాచికాలని తెలుసుకో. పొద్దుట మునసబు పాలికాపులు నీ తమ్ముణ్ణి చంపేవలసిందే. కానీ పంతులు అడ్డుపడ్డాడు. ఇదే లాస్టు వార్నింగని మునసబు మీతో చెప్పమన్నాడు. ఇంకోసారి ఇలా జరిగితే ఇంటికి ఆడి శవమేవస్తాది. తులశమ్మా నీకొడుక్కి జాగరత చెప్పు”. అంటూ హెచ్చరించి వచ్చిన ముగ్గురూ వెళ్ళిపోయారు. పెద్దాడు తలదించుకుని మౌనంగా వెళ్ళి తలుపు

దగ్గరకు వేసి వచ్చేడు. తులశమ్మ కాండ్రించి తుపుక్కున చిన్నాడి మోహం మీద ఉమ్మేసింది. "మనిషయి పుట్టేక మానం మర్యాదా వుండాలి. సిగ్గూ లజ్జా ఉండాలి. అవన్నీ లేనివాణ్ణి ఎవరూ బాగుచెయ్యలేరు. చదువూ సంధ్యాలేకపోతే తర్వాత రోడ్లంట అడుక్కుని బ్రతుకుతావ్. నాతిట్లు ఊరకే పోవు. ప్రాణం విసుగెత్తి పోతోంది నీతోటి" అంటూ ఏక బిగిన పావుగంట పావుగంట సేపు తిట్టిపోసింది తులశమ్మ.

★ ★ ★

తర్వాత-

పదిహేను సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

తులశమ్మ పదేళ్ల క్రితం కాలధర్మం చేసింది. కానీ ఆవిడ తిట్లూ దీవెనలూ మాత్రం ఫలించాయి.

పెద్దాడు డాక్టరయి పరులకు సేవచేయటమే ధ్యేయంగా పెట్టుకుని నీతినీ, నిజాయితీని నమ్ముకుని, ఆ నిజాయితీ నిలబెట్టుకొనే యత్నంలో పై ఆఫీసర్లతో ఘర్షణపడి , నాగరికతకు దూరంగా గిరిజనులకు దగ్గరగా, అడవుల మధ్యలో ఈగలు దోమల సహచర్యంతో, ఏజెన్సీ లోయలలో ఒకమారు మూల కుగ్రామంలో ఆరోగ్య కేంద్రంలో డాక్టరుగా బతుకు తున్నాడు!

చిన్నాడు, ఈ పదిహేను సంవత్సరాలలోనూ, గ్రామాలంట, రోడ్లంట తిరిగి చాలాసార్లు ముష్టిఎత్తేడు ఓట్లకోసం! మొదటిసారి పార్టీ కార్యకర్తగా తిరిగి, రెండోసారి గెల్చిన ఎమ్మెల్యే కుడిభుజంగా మిగిలి, మూడోసారి స్వయంగా సీటు సంపాదించి ఎమ్మెల్యేగా గెల్చి, నాలుగోసారి పార్టీ ఫిరాయించి మంత్రి పదవి సంపాదించి; ఓ రాష్ట్రాన్ని ఏలుతున్నాడు!!

★

(మయూరి వీక్లీ అక్టోబరు 1985)